జయజయ శంకర




హరహర శంకర

శ్రీః

# కామకోటి వాణి

శ్రీ శుభకృత్ శ్రావణ మాసం - ఆగస్టు 2022

సంపుటి : 1



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# 'పెద్ద'బాలశిక్ష – 'పెద్దబాల'శిక్ష రెండూ అవసరమే

పూజ్య పరమాచార్యులవారి జయంతి సందర్భంగా శ్రీశ్రీశ్రీశంకర విజయేంద్రసరస్వతీ స్వామివారు శ్రీ వి.ఎస్.అర్ మూర్తిగారికి ఇచ్చిన ఇంటర్వ్యూ

**మూర్తిగారు :** "వందే గురూణాం చరణారవిందే సందర్శిత స్వాత్మ సుఖావబోధే, జనస్య యే జంగలికాయమానే సంసార హాలహల మోహశాంత్యై. ఆలంబేన విహీనం యోమాభుం పరిపూర్ణం, నిశ్శబ్దం గురురూపం తద్బ్రహ్మ స్ఫురతాన్మయి." స్వామివారి దివ్య శ్రీ చరణారవిందాలకు ప్రణామ సహస్రములు సమర్పించుకుంటున్నాను. మహాస్వామివారి జయంతి సందర్భంగా జగద్గురువులైన మీ ద్వారా ప్రపంచానికి ముఖ్యంగా యువతకి కావలిసిన సందేశాన్ని ఇవ్వవలసినదిగా కోరుతూ ఈ సంవాదాన్ని మొదలు పెడుతున్నాను. ఏ దేశంలో చూసుకున్నా ఇవాళ యువత 68% ఉంది. ఇంకా పెరుగుతోంది. వృద్ధులూ పెరుగుతున్నారు కాని వారు సమాజానికి పెద్ద ఉపకారం చెయ్యగలిగిన స్థాయిలో లేరు. కానీ ఈ యువత యొక్క శక్తిని ఛానలైజ్ చేసి సనాతనధర్మంవైపు మళ్ళించి దాన్ని సమాజహితం ఎలా చెయ్యాలి? ఈ సనాతనమైన, ఆర్షమైన, భారతీయమైన సంస్కృతిని ఎలా ముందుకు తీసుకువెళ్ళాలి ?

**స్వామివారు :** యువతలో శక్తి ఉంది. ఆ శక్తిని సరిగ్గా ఛానలైజ్ చేసి మార్గదర్శనం చేస్తే అది సదుపయోగం అవుతుంది. ఇప్పుడు శక్తి మాత్రం ఉంది కాని అది దురుపయోగం లేదా అనుపయోగం అయ్యే అవకాశం ఉంది. అలా కాకుండా సదుపయోగం అవటానికి ధర్మప్రశిక్షణ అవసరం. ఇప్పుడు యువత తపన డిగ్రీలు ఎలా పొందాలి? ఎలా ఉద్యోగాలు, ఉపాధులు సంపాదించుకోవాలి? తరవాత ఇల్లు కట్టుకోవటం, తరవాత ఇల్లాలు, సంసారం, అలా వాళ్ళ ఆలోచన వెళుతోంది. ఐతే వీళ్ళకి ధర్మం గురించి ఎప్పుడు అభిప్రాయం మొదలు అవుతుందో అప్పుడు ధర్మం అందుబాటులో ఉండాలి. అంటే ధర్మమనేది అందించటానికి సిద్ధంగా ఉండాలి. అందువల్ల ఈ రోజుల్లో ఉపకారం చేయడానికి ధార్మికసంస్థలు ముందుకు రావాలి. అప్పుడు యువత ఉపదేశం పొంది, వాళ్ళలో ఉండే శక్తి సామర్థ్యాలను ధర్మబద్ధంగా వినియోగించగలుగుతారు. ఈ రోజుల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి, సమాజ నిర్మాణం జరగాలి. దానికోసం ప్రాచీనాన్ని దూరంపెట్టి వికాసం ఆలోచించటం అనేది ప్రమాదం. మన ప్రాచీనశాస్త్రాలు కొత్త విషయాలను నిరాకరించటం లేదు. కానీ వేద, శాస్త్ర, పురాణ, ఐతిహ్య, సదాచార, మరియు పెద్దవాళ్ళు ఆచరించిన మంచి మార్గాలు, ఈ పరిధిలోపల ఉన్న కొత్త విషయాలు మనం స్వీకరించవచ్చు. పాశ్చాత్య దేశాల నుండి మనం సైన్స్, టెక్నాలజీ వాడుకోవచ్చు. కాని పాశ్చాత్యమే వికాసమనే భావన వద్దు. ఇదివరకు విజ్ఞానం అంటే ఇక్కడే ఉంది. ఇన్స్ట్రుమెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్,





ఎన్‌కరేజ్‌మెంట్, ఎన్‌గ్రేవ్‌మెంట్ మొదలైనవి లేకుండా ఆ విజ్ఞానం దుర్బలమైంది. ఆయుర్వేదం, జ్యోతిష్యం, వాస్తుశాస్త్రం, అంతరిక్షశాస్త్రం మొదలైన గొప్ప విజ్ఞానం మనది. ఈ రోజు పాశ్చాత్య దేశస్థులు నీళ్ళని కాపాడండి, నేలని కాపాడండి, గాలిని కాపాడండి అని అంటున్నారు. కాని అసలు పంచభూతాలని కాపాడాలి అనే తత్వాన్ని లోకానికి సందేశంగా ఇచ్చినది మనదేశమే. సైన్స్, మాథమేటిక్స్, హిస్టరీ వీటి యొక్క పునాది మనదేశంలోనే ఉన్నది. భూమి గోళాకారంలో ఉంది అని మనవాళ్ళే చెప్పారు. అప్పట్లో ఏ సైన్స్ లేకపోయినా సప్తద్వీపాలు అని చెప్పారు.

**'శతయోజన విస్తీర్ణం, సేవ అనేది 'విశ్వం విష్ణు'గా (విశ్వవ్యాప్తంగా)గా ఉండాలి :**

పుష్పవే లవణార్ణం' అని కాలిక్యులేటర్ లేని కాలంలో పురాణాలలో కొలతలన్నీ చెప్పారు. మన ఋషులు అందించిన ఆ విజ్ఞానము, ఆ విజ్ఞానము యొక్క ఉద్దేశ్యాలు ముఖ్యం. అంటే పాశ్చాత్య విజ్ఞానానికి మన దేశ విజ్ఞానానికి తేడా మంచి సంకల్పముతో వినియోగించటమే. మన విజ్ఞానములో మంత్రం కూడా చాలా ముఖ్యమైనది. విజ్ఞానాన్ని దుష్ప్రయోగం చెయ్యకూడదు. అందుకే విద్యార్థిని పరీక్ష చేసి ఉత్తీర్ణుడు అయితేనే గురుకులంలో చేర్చుకుంటారు.

'ఆగండి, చూడండి, తరువాత ముందుకు వెళ్ళండి' అన్నట్లుగా సావధానంగా మన దృష్టికోణం ఉండాలి. అలా ఉంటే మీరు చెప్తున్న 68% యువత లోకంలో ఎన్నో పెద్దపనులు, గొప్పపనులు చేయగలరు. వారికి లోకము, భారతదేశము, నగరము, గ్రామము అంటే, అవగాహన ఉండాలి. వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఇవి వేటికి వాటికి తేడా ఉన్నా అప్రోచ్ ఎలా అవ్వాలి, ఉద్యోగం చేస్తున్నప్పుడు ఏ అభిప్రాయంలో ఉండాలి, భారతదేశంలో ఉన్నప్పుడు ఎలా ఉండాలి, స్వగ్రామంలో ఎలా ఉండాలి అన్న అవగాహన ఉండాలి.

ఇప్పుడున్న టెక్నాలజీతో పెద్దచెట్టును, ఇల్లును కూడా ఒక చోట నుండి తీసి వేరేచోట పెడుతున్నారు. అందువల్ల సైన్స్ మనకు వ్యతిరేకం కాదు, కాని ఉద్దేశ్యం ధర్మంతో కూడినదై ఉండాలి. నాశనం చెయ్యటం మన ధర్మం కాదు, ఉత్పత్తి చేయటం మన ధర్మం. విదేశీయులు వారి టెక్నాలజీని కొన్ని సంవత్సరాలు మాత్రమే ఉండేటట్లు చేస్తారు. వ్యాపారాన్ని కొనసాగించుకునేందుకు ఎప్పటికప్పుడు టెక్నాలజీ మారుస్తారు. కానీ మన దేశం యొక్క ఉద్దేశ్యం అది కాదు. నిరంతరంగా, దీర్ఘకాలంగా, సైడ్ఎఫెక్ట్ లేకుండా, ఉంటుంది. మన లక్ష్యం భారతీయంగా, సేవ అనేది "విశ్వం విష్ణు"గా ఉండాలి.

**సెల్ఫ్ రియలైజేషన్ వస్తే 'సెల్ఫ్' (స్వార్థం)తగ్గుతుంది :**

**మూర్తిగారు :** భారతీయ వైజ్ఞానిక భూమికలో వరాహమిహిరుడు బృహత్సంహిత రాసి ఈ ప్రపంచానికి

మహోపకారం చేశాడు. భూగోళంలో ప్రతివాడికి ఖగోళం చూపించాడు. మీరు చెప్పినట్టు ఏ ఇన్స్ట్రుమెంట్ లేకుండా చేయగలిగాడు. ఇవాళ ఇంత విజ్ఞానం పెరిగింది, డిగ్రీలు పెరిగినాయి, అనేక ఇన్స్ట్రుమెంట్స్ పెరిగినాయి, ఏదైనా చేయగలిగిన శక్తి ఏర్పడింది. అయినా మనిషిలో మానవత్వకోణం ఎందుకని వెనుకబడిపోయింది ?

**స్వామివారు :** ఈ రోజు విజ్ఞానాన్ని ఒక పుస్తకంలాగా, వ్యాపారంలాగా, రాజకీయంలాగా చూస్తున్నారు. రాజకీయంలో కూడా "రజకీయం" చేయవలసిన అవసరం ఉంది. అంటే శుద్ధపరచాల్సిన అవసరం చాలా ఉంది. అలా ఉన్నప్పుడు శుద్ధసత్వం అనే స్థాయికి రాజకీయం వచ్చినప్పుడు సమాజహితం కోసరమే విజ్ఞానం అనే అభిప్రాయం వస్తే మన పదవులు, మన గౌరవాలు అన్నీ కూడా సమాజహితం తరువాతనే అని తెలుస్తుంది. ప్రయారిటీ అనేది సమాజహితమే అన్న నిర్ణయానికి వస్తే పర్మినెంట్ వాల్యూస్ కాపాడగలుగుతాం. ఉదాహరణకి ఈ దేశంలో ఎన్నో వేల సంవత్సరాలకాలం నాటిదైనా పిల్లలమఱ్ఱిని కాపాడారు. అంటే చెట్టుపై ఉండే గౌరవం, నమ్మకం దానికి కారణం. అదే దానిని ప్లాట్స్‌గా మార్చాలనుకుంటే వారు ఎప్పుడో మర్చేసేవాళ్ళు. కానీ ప్రకృతి పరిరక్షణ ముఖ్యమని అప్పటి వారు భావించారు.

అందుకని మనం విజ్ఞానాన్ని భోదించే సందర్భంలో హక్కులతో పాటు కర్మయోగం గురించి కూడా నేర్పాలి. నాకు ఈ రైట్స్ ఉన్నాయి అంటారు. ఐతే "రైట్, రాంగ్" కూడా ఉన్నాయి. రైట్ (హక్కు)తో పాటు రైట్ (సరైనది) కూడా నేర్పాలి. అప్పుడు సెల్ఫ్ కంట్రోల్, సెల్ఫ్ డిసిప్లేన్, సెల్ఫ్ రియలైజేషన్ వచ్చి సెల్ఫ్ (స్వార్థం) తగ్గుతుంది.

## GDP - GOD, DHARMAM AND PEOPLE :

**మూర్తిగారు :** ఈ దేశంలో చెట్టు, పుట్ట, గుట్ట, మిట్టలలో అన్నిటా దైవాన్ని దర్శించిన జాతి మనది. దీనిని భారతీయ ఆత్మ అంటారు. అమెరికన్ ఆత్మ, రష్యన్ ఆత్మ అనము. అందరూ సోల్ అని వాడతారు. మనం సెల్ఫ్ అంటాము. సోల్ కాదు మనకి కావలిసినది, సెల్ఫ్ మాత్రమే. ఈ భారతీయ ఆత్మ నుండి మనిషి ఎందుకు వైదొలిగి పోయినాడు? స్వార్థం వల్లనా ? అజ్ఞానం వల్లనా? చెప్పవలసినవారు సరిగా చెప్పకపోవడం వల్లనా?

**స్వామివారు :** నిరంతర ప్రయత్నం కావాలి. అప్పుడప్పుడూ శ్లోకాలు చెబుతాం, నేర్చుకుంటాం. అక్కడితో ఆగిపోకూడదు. అధ్యయనం, ఆవృత్తి, అభ్యాసం, అనుష్ఠానం చివరకు అనుభూతి వరకూ వెళ్ళాలి. దానికి నిదర్శనం మరియు దర్శనం ముఖ్యం. ఈ రెండింటికీ మంచి సంబంధం ఉండాలి. దర్శనం అంటే శాస్త్రము. నిదర్శనం అంటే గ్రౌండ్ రియాలిటీ. వాటిని మనం సరిగ్గా అర్థం చేసుకొని క్రమక్రమంగా ముందుకు వెళ్ళాలి. దానికి క్రమసహ






శిక్షణం, క్రమశిక్షణం రెండూ కావాలి. అందుకని ప్రాఫిట్ అనేది కేవలం ఎకనామికల్ గా చూడకుండా ప్రాఫిట్‌ని హ్యాపీనెస్, హెల్త్, మరియు హెరిటేజ్‌లలో చూడాలి. ప్రాఫిట్‌లో GDP గురించి చెప్తారు కదా. God, Dharmam and People, ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకొని ఆ GDP రూపొందిస్తే ఈశ్వరభక్తి ఉంటుంది. ధార్మిక ఆలోచనలు ఉంటాయి. మానవతా స్నేహం ఉంటుంది. మానవత కోసమే ఈ ధర్మము. షార్ట్ టైమ్ గోల్స్ ఎచీవ్‌మెంట్ కోసం మనం చూస్తున్నాము, వాటితోపాటు శాశ్వతంగా ఉండే ఆత్మగుణాలని కూడా మనం పరిరక్షణ చెయ్యాలి. అంటే దానికి సిస్టం ఉండాలి. ధర్మానికి ఫ్రెండ్లీగా ఉండే పర్యావరణం ఉండాలి. ధర్మానికి వ్యతిరేకంగా ఉండే పద్ధతుల ద్వారా నేను 'నా స్వార్థం' నేను సాధించుకుంటాను అనే తత్వం ఉండకూడదు. ధర్మానికి అనుగుణంగా మన స్వార్థాన్ని మనం సంరక్షణ చేసుకోవచ్చు.

**మూర్తిగారు : ప్రస్తుతకాలంలో ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో యువతని వాహికగా చేసుకొని, వాళ్ళని ధర్మంవైపు నడిపించడానికి, ధర్మ విశిష్టత చెప్పటానికి, ఒకవేళ ఎవరైనా 'వేదాలలో ఏమీ లేదు' అనగానే వీళ్ళు ఆగిపోకుండా ఉండటానికి, పక్షిశాస్త్రం,కిరణశాస్త్రం లాంటి ఎన్నో శాస్త్రాలను డీకోడ్ చెయ్యటానికి ఏదైనా ఒక సర్వోత్తమమైన ఒక విజ్ఞానపీఠం గురించి ఆలోచన చేయవచ్చా స్వామి?**

**స్వామివారు :** అవును , బాగా చేయవచ్చు. దాని అవసరం కూడా ఉంది. ఆ ప్రయత్నంలో ఇప్పుడు వేదసప్తాహం అనే కార్యక్రమం కూడా చేయిస్తున్నాము. మంచి చదువుకున్న శాస్త్రజ్ఞుల చేత వేదంలో ఉన్న సైన్స్, సమాజము, ప్రకృతి పరిరక్షణ, ఫ్రెండ్‌షిప్, స్వచ్ఛత, ఇలాంటి విషయాలు అన్నీ కూడా చెప్పడం జరుగుతుంది. వేదమనేది జ్ఞానరాశి. అలాంటి వేదాన్ని ఒక్కొక్క పార్ట్‌గా తీసుకొని మనం మన లైఫ్‌లో దానిని ఒక పార్ట్‌గా చేసుకోవాలి. దానికోసం వేదవిజ్ఞానాన్ని విశదీకరించటం, వివరణాలు ఇవ్వటం, విశ్లేషణ చేయటం అవసరం. ఈ రోజు సమాజంలో శ్రద్ధ ఉన్నది. శక్తి ఉన్నది. ఐతే వీటికి ఒక సంస్థ కావాలి. ఆ సంస్థను 'సమాజదృష్టి'తో నడిపేవారు కావాలి. అప్పుడు ఆ సంస్థ సమాజానికి ఉపకారం చెయ్యగలుగుతుంది.

**NON POLITICAL LEADERSHIP - SOCIETY LEADERSHIP కావాలి :**



**మూర్తిగారు :** ఈ నేపథ్యంలోనే మొన్న ఒకటో తారీకున స్వామివారు ఒకమాట చెప్పారు. "రాజకీయపరమైన పదవులు ఒక ఫ్రేమ్‌వర్క్‌లో రాజ్యాంగ బద్ధంగా చేయవలసిందే, చేస్తారు. అడ్మినిస్ట్రేటర్స్ అంతా వాళ్ళ రూల్ ప్రకారం వాళ్ళు పని చేస్తారు. మరి సాంస్కృతిక నాయకులు ఎక్కడి నుండి వస్తారు ? ఎవరు తయారు చెయ్యాలి?" అని, మరి ఈ సాంస్కృతిక నాయకత్వానికి స్వామివారు నిర్దేశించిన ప్రధాన మౌలికమైన లక్షణాలు ఏమిటి ? ఎలాంటివారు అటువంటి నాయకుడు కావాలి స్వామి?

**స్వామివారు :** దానికి "గైర్ రాజనీతిక్" అంటే Non Political Leadership కావాలి. Society Leadership కావాలి. వాళ్ళకి సమాజమనేది ముఖ్యోద్దేశ్యంగా ఉండాలి. పరిపూర్ణత్యాగం అనేది వెంటనే సాధ్యం కాదు. అలా అవకాశం తక్కువ. అలాంటప్పుడు మనం ట్రెంస్ఫర్ చెయ్యటం అంటే దానికి సమయం ఇచ్చేవాళ్ళు కావాలి. వారి సామర్థ్యాన్ని ఇచ్చేవారు కావాలి. సంపదలు ఇచ్చేవారు కావాలి. అలా సమయము, సామర్థ్యము, సంపద మూడు ఇచ్చేవారి కొరకు మనం ఒక సాఫ్ట్‌వేర్ తయారు చెయ్యాలి. ఎవరిచేత ఏ సేవలు చేయించవచ్చు, దానికి సమాజంలో ఉన్న ఆవశ్యకత ఏమిటి ? వాళ్ళు అందించే సేవలు ఏమిటి ? దానికోసం ఒక ప్లాన్ తయారు చేసి పథకాలు తయారు చేయాలి. అంటే విరామకాలంలో (రిటైర్మెంట్) ఆరామంతో పాటు సమాజసేవ కూడా వాళ్ళు అందించితే డ్రిప్ ఇరిగేషన్ లాగా బిందువు అనేది సింధువు అవుతుంది. అది ఆనందసింధువు కావాలంటే బిందువు నుండే ప్రారంభించాలి. "తస్మిన్ ఆనందసింధౌ" అంటారు. ఒక ముగ్గు వేయాలంటే చుక్కలు పెడతారు. ఆ చుక్కలు కలుపుకుంటూ ముగ్గుని పూర్ణం చేస్తారు. ఆ పూర్ణం వినాయకుని చేతిలో ఉండే మోదకంలోని చూర్ణంలాగా మాధుర్యాన్ని ఇస్తుంది. "స్వస్థా స్వభావ మధుర"

అన్నట్లు స్వభావంలో మాధుర్యం రావాలి. దీనికి ఒక్కొక్క నగరం, ప్రాంతం నుండి మనం ప్రారంభిస్తే, సమాజ సేవకులు, ప్రచారకులు తయారవుతారు.

యువతకి, పిల్లలకి మన సాహిత్యం, చతుష్షష్టి కళలు, నేర్పిస్తూ వారి దైనందిన జీవితంలో వారు ఆచరించే ఆటలు, పాటలు, మాటలు వీటితో పాటు మన ధర్మాన్ని, సంస్కృతిని బోధించే విధంగా చెయ్యాలి. నేర్పటంలో మాధుర్యం ఉండాలి. అప్పుడు నేర్చుకునే దానిలో కూడా మాధుర్యం వస్తుంది. అలా మనము పరివర్తన తీసుకురావాలి.

**మూర్తిగారు :** **1974లో ఏలూరులో మహాస్వామివారు "మీరు దానం తీసుకునేటప్పుడు ఏదైనా తీసుకోండి, తప్పులేదు, సమాజహితం కోసం తీసుకోండి. మీరు ఆ దానం మీకోసం తీసుకొంటే వామనులైపోతారు. అదే సమాజహితం కోసం తీసుకొంటే త్రివిక్రములౌతారు అని. మీరు ఏ దానం తీసుకోవాలి అంటే కాల దానం తీసుకోండి అన్నారు. అంటే సమాజము నుండి కాలమును అడగండి, ఆ 'టైము' నుండి అద్భుతమైన సంపద, విజ్ఞానం, జ్ఞానతృష్ణ, ఇవి అన్నీ పెరిగి మళ్ళీ ఒక హైందవ సనాతనధర్మం మనకు ఏర్పడుతుంది. మనం మన విద్యావిధానం పోగొట్టుకొన్నము, కానీ రూట్స్ పోలేదు. కాని వాటి నుండి దూరం అయ్యాము. మళ్ళీ ఆ రూట్స్ కొరకు అంకోల వృక్షం నుండి విత్తనాలు ఎటు వెదజల్ల బడినా గాలి ద్వారా తిరిగి మూలంలోకి ఎలా చేర్చబడతాయో అటువంటి ప్రయత్నం చేయవలసి ఉంది" అనే అద్భుతమైన సందేశం ఇచ్చారు.**

**స్వామివారు :** ఆ ప్రయత్నం ఈ రోజుకి కూడా అవసరమైన విషయం. ఇప్పుడు ఆధునిక విజ్ఞానం కూడా కలిసింది. కమ్యూనికేషన్ ఫెసిలిటీస్, ట్రాన్స్‌పోర్ట్ ఫెసిలిటీస్ కూడా వచ్చాయి కనుక దీనిని మనం అనుకూలంగా వాడుకొని Reach అవ్వడానికి, Recharge అవ్వడానికి, Rich అవ్వడానికి, వినియోగించాలి. సమయము ఒకసారి వెళ్ళిపోతే మళ్ళీ తిరిగి రాదు "కాలః సకృత్ అభ్యేతి" అంటారు. ఇంకా బాలెన్స్ కూడా అవసరం. "సమం వా త్రివర్గం" అంటే 'ధర్మార్థ కామం' అనే వాటిలో బాలెన్స్ కూడా అవసరం. మనం ధర్మం గురించి ఆలోచిస్తున్నప్పుడు వాస్తవం గురించి, వాస్తవం గురించి ఆలోచించేటప్పుడు ధర్మాన్ని గురించి కూడా ఆలోచించాలి. అలా మనం బాలెన్స్ చేసుకుంటూ వెళ్ళాలి.

### సనాతనం మరియు సనూతనం (INTEGRATED EDUCATION) :

**మూర్తిగారు :** ఈ సనాతన ధర్మాన్ని ప్రాక్టికల్ గా అనుష్ఠాన



**వేదాంత భూమికలోని తేవటానికి ఈక్వాలిటీ, ఈక్వానిమిటీ, ఈక్విపాయిస్ ఈ మూడు ఉండాలి.సమస్థితి ఉండాలి. మహాదుఃఖం కలిగినా, మహా ఆనందం కలిగినా నిశ్చలంగా ఉండాలి. అది మనది కాదన్నట్లుండాలి. కాని కర్మ చేస్తుండాలి. "కర్మానుబంధే మనష్యాణాం". కాబట్టి దీనికి ఇవాళ మీరు ఈ సమాజానికి ఇచ్చిన ఈ విజన్ కనుక రియలైజ్ చేయగలిగితే యువత నుండి చాలా లాభాలు పొందగలుగుతాం. దాని వల్ల ఒక న్యూజనరేషన్ సృష్టించబడుతుంది అనిపించింది. సనాతనానికి సనూతనం కూడా జోడిస్తే బావుంటుందనిపించింది. దానికి మీ అనుగ్రహము, సూచనలు కావాలి స్వామి.**

**స్వామివారు :** సనాతనం మరియు సనూతనం. దానికోసమే ఇప్పుడు విద్యావిధానంలో మంచి మార్పు రావాలని అనుకుంటున్నాం. అంటే ఈ దేశమనేది సంస్కృతి పరంగా ఒకటే. 1947 తర్వాతే దేశాన్ని కొత్తగా నిర్మాణం చేసుకున్నామని కొంతమంది మాట్లాడతారు. కాని అలా కాదు. ఈ దేశ సంస్కృతి విశ్వవ్యాప్తంగా ఉన్న కాలమొకటి ఉంది. ఇక్కడి అడ్మినిస్ట్రేషన్, ఎకనామికల్ పాలసీ, సర్వీస్‌లలో మనదేశం లోకానికే ఆదర్శంగా ఉంది. అయితే మనకి ఏ విషయంలో కంపేర్ చేసుకోవాలో, ఏ విషయంలో కంపేర్ చేసుకోకూడదో ఒక సరైన నిర్ధారణ లేదు కనుక మనం ప్రతిలిపి (కాపీకొట్టడం) అనేది అనవసరమైన విషయాలలో చేస్తున్నాం. అవసరమైన వాటిని కాపీకొట్టడం లేదు. "ఆనోభద్రాః కృతవోయంతు విశ్వతః". భద్రాః అనే విషయమే ముఖ్యం. కాని భద్రం లేని విషయాలను మనం ఎడాప్ట్ చేసుకుంటున్నాము. అందువల్లనే అశాంతి అనేది ఈ దేశంలో పెరుగుతోంది. దీన్ని ఈ దేశంలోనివారో, ఇతరదేశంలోనివారో దేశహితం లేనివాళ్ళు వాడుకుంటారు. అలా కాకుండా జాగృతి పెరగటానికి మనమొక నూతన విద్యావిధానం అంటే ప్రత్యక్షము – శాస్త్రము వీటి మధ్యలో ఒక సేతుబంధం చేసి దానికొక నిబంధనం చేయాలి. రెగ్యులర్ స్టడీస్ ఫౌండేషన్ పద్ధతిలో నీతిశాస్త్రాలు, ధర్మశాస్త్రాలు గురించి చెప్పటానికి ఆపాతజ్ఞానం అవసరము ఉంది. ఉచ్ఛ శిక్షణ (హైయర్ ఎడ్యుకేషన్), తత్వశాస్త్రం, ప్రకృతి పరిరక్షణ గురించిన అవగాహన పొందాలి. కొన్ని విషయాలు అందరూ కలసి చెయ్యాలి. కొన్ని విషయాలు మన సంస్కృతి ప్రచారం, భాషా ప్రచారం, రీతి, రివాజు, వంటివి గ్రామాలలో చేయవచ్చు. ఇప్పుడు తెలంగాణాలో ఒక యాస ఉంది, తమిళనాడులో ఒక యాస ఉంది. ఇలాంటివి కొన్ని ప్రజల మధ్య నుండి మాయమైపోతున్నాయి. అందుకని కొత్త విద్యావిధానాన్ని ఏర్పాటు చేసుకొని దేవాలయాల తరపునా, స్వచ్ఛంద సంస్థల తరపునా చేపట్టాలి. వాటిని ప్యాక్ చేసి పక్కన పెట్టకుండా ప్యాకేజ్ టూర్ లాగా ప్రచారం చెయ్యాలి.

**మూర్తిగారు : వరాహమిహిరుడు బృహత్సంహితలో సిమెంటు ఎలా తయారు చెయ్యాలో చెప్పాడు. వజ్రసంఘాతము, వజ్రలేపనము అని చెప్పాడు. వజ్రసంఘాతము అంటే సిమెంట్, వజ్రలేపనము అంటే ప్లాస్టింగ్ అని ఉన్నాయి. అపారమైన విజ్ఞానము శాస్త్రాలలో ఉన్నాయి. విమాన నిర్మాణం సమరాంగణ సూత్రములో ఉంది. ఒక ఆర్మేచర్ ఎలా తయారు చెయ్యాలి అనేవన్నీ ఉన్నాయి. ఇవన్నీ నేటితరానికి చెప్పగలిగితే అక్కడ నుండి వాళ్ళ బుద్ధి వికాసం జరుగుతుంది. కాని శాస్త్రవిజ్ఞానానికి పాశ్చాత్యదేశాలవైపు చూస్తున్నాం. అక్కడ నుండి మనం కొనుక్కుంటున్నాము. మనం చెయ్యగలిగే సామర్థ్యం ఉండీ చెయ్యటం లేదు స్వామి. ఇట్లాంటి ఇంటెలిజెంట్ కోషంట్‌ని ఎలా పునరుద్ధరించాలి?**

**స్వామివారు :** ఎలాగైతే కొన్ని దేవాలయాలు ఆస్తులు కలిగివున్నా పేద సంస్థలుగా ఉన్నాయో, అలా ఇక్కడి పరిస్థితులను గమనిస్తే ఆత్మవిశ్వాసం అవసరం ఉన్నది. అందుకని ఆపాతజ్ఞానం అవసరం. ముందు పేర్లు తెలుసుకోవాలి, తరువాత వాటి ఉపయోగం తెలుసుకోవాలి, అప్పుడు ప్రవేశం ఏర్పడుతుంది. తరువాత మిగిలినవాళ్ళు లోపలికి వస్తారు. అలాగే చెప్పే తీరుకూడా మనం మార్చుకోవాలి. ఆకాలంలో 'సంవత్సరం సంవత్స్యథ' అన్నారు. ఒక సంవత్సరం మీరు తపస్సు చేసి తరువాత రండి, నాకు తెలిసి ఉంటే చెబుతాను అని గురువు తన వద్దకు వచ్చిన శిష్యులతో అనేవారు. అది గురువు యొక్క వినయం. "విజ్ఞాస్యామహ సర్వం హనోవక్ష్యామి" అన్నారు. ఈ రోజుల్లో అది అంతా సాధ్యం కాదు. ప్రేమగా చెపాలి. సహాయం చేసి చెప్పాలి. ముందు ఉపకారం చేసి తరువాత ఉపదేశం చెయ్యాలి. హిందూయిజంలో సబ్జెక్ట్‌కి తక్కువ లేదు. ప్రజెంటేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఇప్పుడు కావాలి. ఎలా చెబుతున్నాము, ఎలా వారికి వినియోగం చేస్తున్నాము అనేది ముఖ్యం. ఆ తరువాతనే యోగం కాని, నియోగం కాని వస్తుంది. ముందు వినియోగం చెయ్యాలి. ఆ వినియోగానికి ఒక ఏర్పాటు చేస్తే మంచిది. ఆసక్తి ఉన్నా ప్రవేశమే లేనప్పుడు పెద్దగా రిజల్ట్ కావాలి అనుకోవడం కష్టం. కొత్త పెద్దబాలశిక్షలు తయారు చేయాలి. దానిలో




సంగీతము, వాస్తు, శిల్పం, సాహిత్యము, నాట్యం వంటివి పొందుపరచాలి. పెద్దబాలురను కూడా దీనిలో ప్రవేశపెట్టి మనం దీనిని ప్రచారం చేయాలి. అది "పెద్ద"బాలశిక్ష, ఇది "పెద్దబాల" శిక్ష.

**మూర్తిగారు :** ఈ భారతదేశం గురుస్థానంలోకి వెళుతుందని మిగతావారి ప్రవచనాలలో నేను వింటూ ఉన్నాను. అంటే ఇప్పుడు గురుస్థానంలో లేదా? అసలు ఉన్నదే గురుస్థానంలో కదా ? "గురుస్థానీయులు" వేరు గురువు వేరు కదా స్వామి. అంటే గురుస్థానం దాకా వెళ్ళినవాడు గురుస్థానీయుడు. గురువు అంటే సర్వమూ తానైనవాడు. సర్వము ఎరిగినవాడు. సర్వజ్ఞుడు. అటువంటి గురుస్థానీయులను దాటి గురువులుగా, జగద్గురువులుగా మీరు ఉన్నారు. మీరు యువతకు మాత్రమే కాదు ఈ ప్రపంచానికి, సమస్త మానవాళికి ఒక మహత్తరమైన సందేశాన్ని ఇవ్వవలసినదిగా నేను మిమ్ములను ప్రార్థిస్తున్నాను.

**స్వామివారు :** ఈ రోజుల్లో ధర్మమనేది సంఖ్య (నెంబర్స్ ఆధారంగా) ఆధారంగా దాని గొప్పతనాన్ని చెప్పటం లేదా అధికారపక్షంగా ఉందని దాన్ని గొప్పదని చెప్పటం బదులుగా ఆచరణ ప్రధానంగా ఉండాలి. ధర్మం అనేది ప్రధానం. అధీతి, బోధ, ఆచరణ, ప్రచారణైః. ముందు ఎడ్యుకేషన్, ధర్మశిక్ష, ధర్మపాఠము. రెండవది బోధన, దానిని అర్థం చేసుకోవటం, మూడవది ఆచరణము. 'యుక్తాహార విహారస్య' మొదలైనవి. నాలుగవది ప్రచారం. ముందరి మూడూ వదిలేసి ప్రచారమే ముఖ్యమనుకొని ప్రచారం చెయ్యటం వలన పూర్ణ ఫలితం ఉండదు. కొన్ని వేదపాఠశాలలు తప్పించి (సనాతనధర్మ ప్రచారం కోసం) దీనికి తగినన్ని స్కూల్స్ లేవు. ప్రభవ, విభవ.. చైత్రం, వైశాఖం.. చెప్పేవాళ్ళు కూడా లేరు. అందుకని మనం కొత్త టెక్స్ట్ బుక్స్ రాయాలి. శాస్త్ర విషయాలను సులభంగా నూతన భాషలో సౌఖ్యంగా రాయించాలి. శోభనా సులభాగతిః. అలా బాగుంటుంది. లోకంలో ఈ రోజు పరిస్థితి ఏమంటే విదేశాల్లో వనరులు (రిసోర్సెస్) ఉన్నాయి. ఈస్ట్, వెస్ట్ రిలేషన్స్‌ను మనం స్ట్రెంగ్తెన్ చెయ్యాలి. ప్రోపర్ అండర్ స్టాండింగ్ ఉండాలి. అప్పుడు ప్రోపర్ కోపరేషన్ ఉంటుంది. ప్రోపర్ అండర్‌స్టాండింగ్‌కి ఆ రోజుల్లో వివేకానందస్వామి చికాగో వెళ్ళి చెప్పారనేది ఆ రోజుల్లో చాలా ఉపయోగపడింది. ఇప్పుడు యుద్ధాలు జరగటం లేదుకాని అభిప్రాయాలలో చాలా తేడాలు ఉన్నాయి. స్పర్ధలు కూడా

ఉన్నాయి. అందుకని చదువులో స్పర్ధ ఉంటే విషయం వేరు. "శ్రద్ధాయా స్పర్ధా". కానీ ఇప్పటి మతపరమైన స్పర్ధలు మంచిది కాదు. మతానికి, అధికారస్థానానికి వైపరీత్య సంబంధాలు ఉండటం మంచిదికాదు. అలా ఉన్నప్పుడు ఆ గాలి ప్రభావం భారతదేశంలో కూడా కనిపిస్తుంది. సాధారణ భూమి అయితే గోడ కట్టవచ్చు. ఇలాంటి గాలికి గోడ ఎట్లా కట్టేది. మన ధర్మప్రచారం మన భారతదేశంలో మాత్రమే కాకుండా మనం విశ్వవ్యాప్తంగా చేయాలి. భారత సంస్కృతి అనేది ఎవరికీ వ్యతిరేకమైనది కాదు. అందరినీ గౌరవించే సంస్కృతి. ఎవరికీ కూడా హాని కలిగించే తత్వం ఇందులో లేదు. తనని కాపాడుకోవటం అనేది తన సంకల్పం అయి ఉండవచ్చు కానీ ఇతరులకు హానీ కలిగించటం కాదు. హానిని ఉద్దేశించే సంస్కృతి కూడా కాదు. "సర్వే జనాః సుఖినో భవంతు" అనే సంస్కృతి ఇది. అందువల్ల ముందటి కాలం కన్నా ధర్మ ప్రచారం ఇంకా పెద్ద ఎత్తున జరగాలి. ఎదురింటి, పక్కింటివాళ్ళ పట్ల వ్యతిరేక భావం లేదు కాని వారికి మన పట్ల వ్యతిరేకభావం లేకుండా చూసుకోవాలి. "స్వదేశే పూజ్యతే రాజా" అన్నట్లుగా మనం చేసి తరువాత మనం "విద్వాన్ సర్వత్ర పూజ్యతే" అనే స్థాయికి చేరుకోవాలి. దానికి మనం వాస్తవాన్ని తెలుసుకొని ఒక మధ్యేమార్గంగా ప్రయత్నం చేస్తే "భారత సంస్కృతికి, సనాతన ధర్మానికి" మంచి భవిష్యత్తు ఉంటుంది. దానికి ఎలాంటి సంకల్పం తీసుకుంటాము అనే దాని బట్టి ఫలితాలు ఉంటాయి.

"జయేంద్రసరస్వతీ స్వామివారు ప్రేమను ప్రసాదంలా పంచారు. అదే ధర్మం యొక్క తత్వం"

**మూర్తిగారు :** **మహత్తరమైన సందేశాలు ఇచ్చారు మీరు. ఇవాళ ఇలాంటివి ఈ దేశానికి చాలా అవసరం. మీరు మామూలుగా కాకుండా చాలా ప్రాక్టికల్ గా చాలా రేషనల్ గా చెప్పారు. దీనిని నేను నిజమైన అనుష్ఠాన వేదాంత భూమికగా నేను భావిస్తున్నాను స్వామి. వేదాంతం, వేదము కేవలము చెప్పుకునేవే కావు, ఆచరణాత్మకమైనవి. ఆచరణకు నోచుకోని ఏ శాస్త్రమైనా వ్యర్థమైపోతుంది కదా. శాస్త్రములు ఎలా ప్రమాణాలతో అదే విధంగా శాస్త్రాలు చక్కటి జ్ఞాపకం. అంటే జరిగిన దాని వలన ఒక 'కన్సాలిడేషన్'. సమాజం నుంచి శాస్త్రం పుట్టింది. శాస్త్రం సమాజాన్ని నడిపించింది. ఈ రెంటికి మధ్య ఏర్పడిన వైరుధ్యాన్ని జగద్గురువులే శమింపచేయాలి.**

**స్వామివారు :** ఇప్పుడు శాస్త్రానికి ప్రమాణం కూడా



అవసరమవుతోంది. అది చిన్నగా ఉంటే చాలదు, ఉన్నతంగా ఉండాలి. దానికోసమే పెద్ద స్వామివార్లు ఇద్దరూ కూడా కృషి చేశారు. పరమాచార్యులవారు శాస్త్రాన్ని కాపాడటం కోసం చాలా కృషి చేశారు. ఈరోజు మనం శాస్త్రాలను చూస్తున్నామంటే వారి యొక్క ప్రయత్నమే కారణము. అలాగే ఇన్‌క్లూజివ్ గ్రోత్ అంటే అందరినీ కలుపుకొని అందరికీ ఫలితం ఇచ్చే వికాసం కోసం అన్ని సామాజిక వర్గాల వాళ్ళని జయేంద్ర సరస్వతి స్వామివారు కలుపుకొని సోషల్ ఇంజనీరింగ్ అనే యాస్పెక్ట్‌లో ప్రేమను ప్రసాదంలా పంచారు. అదే ధర్మం యొక్క తత్వం. అలా ఒక్కొక్క కాలానుగుణంగా వారి యొక్క పరిస్థితులను బట్టి వారి ధర్మ ప్రచార కార్యక్రమాలు చేసి శాస్త్ర, ఆగమాలు కాపాడినారు. డెవలప్‌మెంట్‌తో పాటు డివోషన్, డివోషన్‌తో పాటు సర్వీసు ఉండాలి అనే ఒక ఉద్దేశ్యంతో ఇద్దరు స్వామివార్లు చేశారు. వారు ఇద్దరు చేసిన ప్రచార పద్ధతులను ఆధారంగా చేసుకొని, ఈ రోజు పరిస్థితులను బట్టి ప్లాన్ చేస్తే, మన ముందు రెండు డెవలప్‌మెంట్ మోడల్స్ ఉన్నాయి. ఆ రెంటినీ మనం సమన్వయం, సమర్ధనం, సంగమం చేస్తే సమాజానికి హితం కలిగే అవకాశం చాలా ఉంది. దానికి ఇలాంటి మాధుర్యమైన మృదువైన ప్రయత్నాలతో సమాజహితంపై ఆసక్తి కలిగినవారి సంఘం మరియు సంగం ఉంటే 'శ్రేయోభూయాత్ సకల జనానాం' అనేది జరుగుతుంది.



యునైటెడ్ నేషన్స్ కోసం ఎమ్.ఎస్ సుబ్బులక్ష్మిగారి ద్వారా పరమాచార్యులవారు 'మైత్రీం భజతాం' అని పాడించారు. "మైత్రీం భజతాం" అని మంచి పరిస్థితిని కోరుకుంటాం.

**మూర్తిగారు :** చివరిగా ఒక్క విషయం. 1997లో జయేంద్ర సరస్వతీ స్వామివారు హైదరాబద్‌లో ఉన్నన్నప్పుడు మేము 200మంది వికలాంగులను స్వామివారి ఆశీర్వచనము కొరకు తీసుకువచ్చాము. అప్పుడు అమ్మవారి పూజచేసే దగ్గర స్వామివారు కూర్చోబెట్టారు. ఆ రోజు జయేంద్ర సరస్వతీ స్వామివారు "మీరు వికలాంగులమనే న్యూనత వదిలి పెట్టండి. మీరు సర్వాంగుల కంటే ఉత్తములు. సర్వాంగములు ఉన్నా వారు ఏమి చేయటం లేదు, భగవంతుడు ఎన్నడు లోటు చేయడు. మీ మేధాశక్తి అపురూపమైనది". అని స్వామివారు 200మందికీ ఇవ్వమని నాకు ఒక మూట ఇచ్చారు. అందులో హనుమంతుని బిళ్ళలు ఉన్నాయి. అవి ఇచ్చిన తరువాత ఆ రోజు వారితో భజన పాడించారు జయేంద్ర స్వామివారు. అప్పుడు స్వామివారు కూడా వచ్చారు. అదే మీకు ఒకసారి గుర్తు చేసాను. అంటే కంచిపీఠం అనేది ఒక పురాతనమైనటువంటి పీఠము. సమాజానిని దూరంగా పెట్టిన పీఠము కాదిది. సమాజమే ఒక వేదిక. ఇది చలచ్చలితం అయినటువంటిది. ఒక మహా సరస్వతీ ప్రవాహంగా సేవా యోగంగా, దాని సాంప్రదాయకమైనటువంటి పద్ధతులు అన్నింటినీ పాటిస్తూనే అధునాతన యుగానికి మంచి పచ్చతోరణం కట్టినటువంటి ఆచార్యత్రయానికి నేను శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నాను.

**స్వామివారు :** ఆ సందర్భంలో మీరు "పంచశీల" అనే ఒక పుస్తకం అచ్చువేశారు. "స్వతంత్రతా సందేశ్"ని కూడా చేశారు. అది మహాస్వామివారి సందేశం.

**మూర్తిగారు:** ఆ "పంచశీల" కార్డు నా దగ్గర ఇంకా ఉంది స్వామి. "ప్రశ్నోత్తర రత్నమాలిక" నుంచి సంగ్రహం చేసి దానిని వేశాము. జయేంద్రులవారు దానిని అప్రూవ్ చేశారు. మళ్ళీ దానిని అచ్చువేయాలి.

కంచిపీఠం వంటి ఒక మహోత్కృష్టమైన పీఠంలో కొన్ని క్షణాలు మేము కూడా ఉండగలిగే యోగాన్ని అనుగ్రహించినటువంటి గురు స్వరూపాలకు ప్రధానంగా శతకోటి ప్రణామాలు.

**స్వామివారు :** ఈ ఈక్షణ కార్యక్రమానికి మా ఆశీస్సులు.

## పూజ్య శ్రీశ్రీశ్రీ శంకరవిజయేంద్రసరస్వతి స్వామివారు 1983 నుండి చాతుర్మాస దీక్షలు చేసిన ప్రదేశాలు :

| సంఖ్య | సంవత్సరం | ప్రదేశం | |
|---|---|---|---|
| 1 | 1983 | కర్నూలు | గురువులు, పరమగురువులతో కలిసి |
| 2 | 1984 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 3 | 1985 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 4 | 1986 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 5 | 1987 | ఒరిక్కై | గురువులు, పరమగురువులతో కలిసి |
| 6 | 1988 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 7 | 1989 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 8 | 1990 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 9 | 1991 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 10 | 1992 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 11 | 1993 | కాంచీపురము | గురువులు, పరమగురువులతో కలిసి |
| 12 | 1994 | కాంచీపురము | గురువులతో కలసి |
| 13 | 1995 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 14 | 1996 | ఎన్నత్తూర్ | గురువులతో కలిసి |
| 15 | 1997 | హరిద్వార్ | గురువులతో కలిసి |
| 16 | 1998 | హైదరాబాద్ | గురువులతో కలిసి |
| 17 | 1999 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 18 | 2000 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 19 | 2001 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 20 | 2002 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 21 | 2003 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 22 | 2004 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 23 | 2005 | తిరుపతి | గురువులతో కలిసి |
| 24 | 2006 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 25 | 2007 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 26 | 2008 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 27 | 2009 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 28 | 2010 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 29 | 2011 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 30 | 2012 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 31 | 2013 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 32 | 2014 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 33 | 2015 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 34 | 2016 | విజయవాడ | గురువులతో కలిసి |
| 35 | 2017 | కాంచీపురము | గురువులతో కలిసి |
| 36 | 2018 | కాంచీపురము | |
| 37 | 2019 | చెన్నై | |
| 38 | 2020 | తేనంబాకం | |
| 39 | 2021 | ఒరిక్కై | |
| 40 | 2022 | కాకినాడ | |

# శ్రీకంచికామకోటిపీఠం చాతుర్మాసకాలంలోని విశేషమైన రోజులు, పూజలు

| తేది | వారము | విశేషము |
|---|---|---|
| 13.07.2022 | బుధవారం | వ్యాసపూజ, పౌర్ణమిపూజ |
| 14.07.2022 | గురువారము | ఉత్తరాషాఢ నక్షత్రం |
| 16.07.2022 | శనివారము | ధనిష్ఠా నక్షత్రం, దక్షిణాయన పుణ్యకాలం |
| 23.07.2022 | శనివారము | ఆషాఢ కృత్తిక |
| 25.07.2022 | సోమవారము | ద్వాదశి, సోమ మృగశీర్ష పుణ్యకాలం |
| 26.07.2022 | మంగళవారము | ప్రదోషపూజ |
| 28.07.2022 | గురువారము | గురు పుష్యమి, ఆషాఢ అమావాస్య |
| 01.08.2022 | సోమవారము | ఆడి పూరం |
| 02.08.2022 | మంగళవారము | గరుడ పంచమి |
| 03.08.2022 | బుధవారం | ఆడి పెరుక్కు |
| 05.08.2022 | శుక్రవారము | ఆషాఢ స్వాతి, వరలక్ష్మీవ్రతం |
| 07.08.2022 | ఆదివారము | అనుషం నక్షత్రం |
| 09.08.2022 | మంగళవారము | ద్వాదశి, ప్రదోషపూజ |
| 10.08.2022 | బుధవారము | ఉత్తరాషాఢ |
| 11.08.2022 | గురువారము | పౌర్ణమిపూజ, ఋగ్ మరియు యజుర్వేద ఉపాకర్మ |
| 12.08.2022 | శుక్రవారము | శ్రీజయేంద్రసరస్వతిస్వామివారి జయంతి, గాయత్రీ జపం |
| 18.08.2022 | గురువారము | గోకులాష్టమి |
| 20.08.2022 | శనివారము | శని రోహిణీ పుణ్యకాలం |
| 22.08.2022 | సోమవారము | సోమ మృగశీర్షా పుణ్యకాలం |
| 23.08.2022 | మంగళవారము | ద్వాదశి |
| 24.08.2022 | బుధవారము | ప్రదోషపూజ |
| 25.08.2022 | గురువారము | గురు పుష్యమి |
| 30.08.2022 | మంగళవారము | సామోపకర్మ |
| 31.08.2022 | బుధవారము | వినాయక చతుర్థి |
| 03.09.2022 | శనివారము | అనుషం నక్షత్రం |
| 04.09.2022 | ఆదివారము | జేష్ఠాష్టమి |
| 05.09.2022 | సోమవారము | ఆవని మూలం |
| 07.09.2022 | బుధవారము | ఉత్తరాషాఢ నక్షత్రం, ద్వాదశి |
| 08.09.2022 | గురువారము | ప్రదోషపూజ |
| 09.09.2022 | శుక్రవారము | ధనిష్ఠా నక్షత్రం, పౌర్ణమిపూజ |
| 10.09.2022 | శనివారము | చాతుర్మాస్య వ్రత పూర్తి - విశ్వరూప యాత్ర |

# చాతుర్మాస్య వ్రత అనుష్ఠాన మహోత్సవము

శ్రీ ఆదిశంకరాచార్యులవారు సుమారు 2500 సంవత్సరముల క్రిందట సాక్షాత్తు పరమశివుని అవతారవిశేషముగా, మహోన్నతమైన ఆచార్య పరంపరని సర్వజ్ఞపీఠముగా శ్రీకామకోటి పీఠమును ప్రతిష్ఠించి శ్రీమఠం అధిష్ఠానముగా నెలకొల్పడం జరిగింది. ఈ ఆచార్య పరంపరలో ప్రస్తుతము శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్రసరస్వతీ స్వామివారు సనాతనధర్మ సాంప్రదాయాలు ఆచరిస్తూ, కలియుగములో కూడా అందరినీ ఆచరించేలా ప్రోత్సహిస్తున్నారు. బ్రహ్మజ్ఞాన సంపత్తిని జనులందరికి ప్రసాదిస్తూ ధర్మమార్గమును సూచించడములో గురు ఉపదేశములు స్ఫూర్తిదాయకము.

చాతుర్మాస్య వ్రతము ప్రతిసంవత్సరము వ్యాసపూజతో మొదలవుతుంది. ఈ పూజలో వేదవ్యాసుడు మొదలగు గురువులకు కృతజ్ఞతతో గురువందనం తెలపడం ముఖ్య ఉద్దేశ్యం. మానవాళి ఉన్నతికోసం బ్రహ్మసూత్రాలు, మహాభారతం, పురాణాలు మొదలగు పవిత్ర గ్రంథాలను రచించిన మహాఋషి వ్యాసుడు.

స్వామివారు ఈ చాతుర్మాస్య దీక్షలో కఠినమైన నియమాళిని పాటిస్తారు. ఈ దీక్షాకాలంలో స్వామివారి దర్శనము భక్తులకు పుణ్యప్రదమైనది.

ఈ సంవత్సరము ఆచార్యులు ఆషాఢ పౌర్ణమి (13-07-22,బుధవారం) నుండి ఆకొండి లక్ష్మి స్మారకగోశాల డోర్ నెం. 7/138, ఆనందనగర్, ఆచంపేట జంక్షన్, తిమ్మాపురం, కాకినాడలో చాతుర్మాస్య వ్రతం ఆచరించబోతున్నారు.

భాద్రపద పౌర్ణమి (10-09-22,శనివారం) చాతుర్మాస్య ముగింపు సందర్భంగా విశ్వరూపయాత్ర జరుగుతుంది. దీక్షా సమయంలో శ్రీ మహాత్రిపురసుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వర (శ్రీ ఆదిశంకరులచే కైలాసము నుండి తేబడిన యోగలింగము) త్రికాలపూజ నిత్యము జరుగును.

పూజ్య శ్రీ జయేంద్రసరస్వతీ స్వామివారి 88వ జయంతి (13-08-22) ఉత్సవ సమారోహము, సంబంధిత హోమములు, ప్రత్యేక పూజలు, పారాయణము, నామ సంకీర్తనములు జరుగుతాయి.

చాతుర్మాస్య వ్రత అనుష్ఠాన కాలంలో ఉదయం సాంప్రదాయ శంకరభాష్య పాఠములు జరుగుతాయి. దీక్షా కార్యక్రమాలలో భాగంగా చతుర్వేద పారాయణములు, అగ్నిహోత్ర సదస్సులు, పంచాంగ సదస్సులు, వివిధ శాస్త్ర సదస్సులు, వేదభాష్య సదస్సులు, అద్వైత వేదాంత సదస్సులు, ప్రవచనములు, సంగీత కచేరీలు, నామ సంకీర్తనలు, భక్తుల చేత భిక్షా వందనములు, పాదపూజ కార్యక్రమములు, సమయానుకూలముగా నిర్వహించబడును.

భక్తులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకొని శ్రీస్వామివారి అనుగ్రహం, ఆశీర్వాదం పొందగలరని విన్నపము.





వందే గురు పదద్వంద్వం అవాఙ్మానస గోచరమ్ !
రక్త శుక్ల ప్రభామిశ్రం అతర్క్యం త్రైపురం మహః !!